
కథ

# నవ్య ఉగాది



యం. ఉదయభాను

వసంత ఋతువు ఆగమనానికి చిహ్నంగా మామిడిచెట్లు చిగుళ్లు వేసి నిండుగా ఉన్నాయి. చిరుగాలికి మావిడికొమ్మలు బరువుగా తల లూపుతున్నాయి. అంతకాలంగా ఎక్కడో దూరంగా మూగగా ఉన్న కోకిలమ్మ మావిచిగుర్లు మేసి మత్తుగా, గమ్మత్తుగా కుహు(...కుహూ(...రాగాలు తీస్తుంటే అక్కడి వాతావరణం ఆహ్లాదకరంగా మారిపోయింది.

అయితే, ప్రకృతిలోని ఈ అందమైన మార్పుని గమనించే ఆసక్తి, తీరికా లేని జనవాసంగల మహానగరం అది.

ఆ కాంక్రీట్ జంగిల్‌లోని కాకిగూడులాంటి ఓ ఫ్లాట్‌లోని దంపతుల సంభాషణ గమనిద్దామా?!

000

"ఏమండీ...!" గోముగా గునుస్తూ గారాలు పోతోంది శ్రీమతి సరళ.

"ఏమిటీ?" అద్దంలో చూసి తల దువ్వుకుంటూ అడిగాడు సుధాకరం.

"మరే..."

"అబ్బ విసిగించక విషయమేంటో చెబుదూ...అవతల ఆఫీసుకు టైము అవుతోంది."

"అన్నింటికి విసుగే మీకు. అంత విసుగైతే నేనేం చెప్పనులెండి." మూతి ముడిచింది శ్రీమతి.

ఇక లాభం లేదనుకుని, తనే తగ్గాడు సుధాకరం. "నువ్వేం చెప్పా లనుకుంటున్నావో చెప్పు" అంటూ అనునయంగా అడిగాడు.

"మరే...మరో రెండు రోజుల్లో మనం కొత్త సంవత్సరంలో అడుగు పెడుతున్నాంకదా...?"

"అవును...మరో నాలుగు రోజుల్లో ఉగాది పండగ రానుంది...అయితే, ఏమిటంట?"

"మనం మారాలికదా?!"

"అంటే కొంపదీసి నన్ను చీరలు కట్టుకోమంటావో ఏమిటి!" ఆశ్చర్యంగా అడిగాడు సుధాకరం.

"అబ్బ...మీకు అన్నీ వేళాకోళాలే. కొత్త సంవత్సరం వస్తోందికదా. మనం కొత్తగా ఉండాలి. అంటే మన ఇల్లు అన్నీ కొత్త వస్తువులతో నింపాలి."

"అంటే నీ ఉద్దేశం ఏమిటి...కాస్త వివరంగా చెప్పు?"

"అదేనండీ. మనం ఎప్పుడో కొన్న పాతకాలపు ఫ్రిజ్ మార్చి కొత్తది కొందామండి..."

ఆవిడ మాట పూర్తి కాకుండానే...

"అవును, డాడీ!" కోరస్‌గా అంటూ గదిలోకి అడుగుపెట్టారు కొడుకు సుధీర్, కూతురు ప్రియ.

"ఓహో...మీరంతా కూడబలుక్కునే ఈ మార్పుల కార్యక్రమాన్ని తలపెట్టా రన్నమాట" అంటూ సోఫాలో కూర్చున్నాడు సుధాకరం.

"సరే. మరి మీ కోర్కెలుకూడా చెప్పండి." పిల్లలిద్దరినీ అడిగాడు.

అడగడమే ఆలస్యం...ప్రియ తండ్రికి దగ్గరగా జరిగి, "మన టీవీ ఎప్పుడో తాతయ్య కొన్నది. అందులో ఎక్కువ ఛానెల్సుకూడా రావు. దాన్ని మార్చేద్దాం, డాడీ!" ముద్దుగా చెప్పింది.

అలా ప్రియ మాట పూర్తవుతూనే సుపుత్రుడు సుధీర్ అందుకున్నాడు. "డాడీ! మన స్కూటర్ డొక్కయ్యింది. దాన్ని మార్చి ఎంచక్కా బైక్ కొందాం."

"కొత్త సంవత్సరంలో అడుగు పెడుతున్నాం కనుక అన్నీ మార్చేయా లంటారు." ఇంకా నయం, కొత్త మొగుడు కావాలని కోరుకోలేదు...మనసులోనే అనుకున్నాడు సుధాకరం.

"సరే...మీ కోరికలన్నీ తీరాలంటే నాన్నను సంప్రదించాల్సిందే..."


"ఏమిటీ...తాతయ్యను అడుగుతావా? ఇక మా కోర్కెలు నెరవేరినట్టే..." తల్లీ, పిల్లలు మూతులు తిప్పారు.

వాళ్లను కాదంటే యుద్ధం తప్పదుకనుక, "సరేలెండి...సాయంత్రం నాన్నను అడుగుతా..." అంటూ ఆఫీసుకు బయల్దేరాడు సుధాకరం.


000

తన కొచ్చే ఆదాయంతో తన భార్యాపిల్లల కోరికలు తీర్చలేడు. కనుక తన తండ్రి సహాయం అడగడానికి వచ్చాడు సుధాకరం.

గదిలో కూర్చుని పేపరు చదువుతున్నారు రాఘవరావుగారు. ఆయన టీచర్‌గా పనిచేసి రిటైర్







## ఆమీర్ విడాకులకు కారణం?

ఎవరనేది బాలీవుడ్‌లో తలెత్తిన సమస్య. నటీమణులు ఇద్దరి పేర్లు వినిపిస్తున్నాయి రాణీముఖర్జీ, ప్రీతీజింటా. 'గులామ్' చిత్రంలో రాణి చేసే రోజుల్లో ఆమీర్ ఇంటి కెళ్తుండేదిట. భర్తతో ఆమె చనువు చూసిన రీన, అటు పైన 'లగాన్'లో రాణికి అవకాశం లేకుండా చేసిందిట. తరువాత 'దిల్ చాహతా హై'లో ప్రీతితో కలిసి చేయటం కోసం ముందు ఇద్దరినీ 'మిక్సప్' కమ్మన్నాట్ట డైరెక్టర్ ఫరాన్ అఖ్తర్. దాంతో మళ్లీ గొడవలు ప్రారంభమయ్యాయి. కానీ ప్రీతిని, రీన ఏమీ చేయలేకపోయింది. అసలిట్లా ప్రతి అమ్మాయినీ తరువాతి చిత్రాల్లో లేకుండా చేస్తూ పోతే, భవిష్యత్తులో వాళ్లే పెద్ద హీరోయిన్లైపోయి, ఆమీర్‌తో నటించమంటే ఏం చేస్తుందిట? "ఏమీ చేయలేకే కదా విడాకులు తీసుకుంది?" అనుకుంటున్నారు బాలీవుడ్ జనం.

ఎన్.



అయ్యారు.

"నాన్నా!" పిలిచాడు తండ్రిని.

ఆయన పేపరులోంచి తలెత్తి ఏమి టన్నట్లు కొడుకువైపు చూశారు. సాధారణంగా ఎంతో అవసరం వస్తేగాని, తన దగ్గరకు రారని ఆయనకు బాగా తెలుసు.

"ఏంలేదు...పిల్లలు సరదా పడుతున్నారు, నాన్నా..."

"దేన్నిగురించి రా..." పేపరు పక్కన పెడుతూ అడిగా రాయన.

తండ్రి అలా అనగానే, "కొత్త సంవత్సరం వస్తోందిగా..." అంటూ తన భార్యాబిడ్డల కోరికల లిస్టు ఏకరువు పెట్టాడు సుధాకర్.

అంతా విని, "అవన్నీ మార్చడం అంత అవసర మంటావా?" అడిగారు రాఘవరావుగారు.

"పిల్లలు సంతోషంగా ఉండడం మీకు మాత్రం సంతోషంకాదా...?"

"సరే...కాస్త ఆలోచించుకోని" అన్నా రాయన.

***

మరునాడు సాయంత్రం వాకింగ్ పూర్తిచేసి ఇంటికి తిరిగివస్తున్న రాఘవరావుగారికి ఇంటిముందు ఏదో గొడవ జరుగుతుంటే వడివడిగా అడుగు లేస్తూ అక్కడికి చేరుకున్నారు.

పనిపిల్ల లక్ష్మితల్లి రాజమ్మ గట్టిగా అరుస్తోంది.

"ఏం మనిషి వమ్మా నువ్వు....? నువ్వూ పిల్లల కన్నతల్లివే కదా...పనిపిల్ల అయితే మాత్రం మనిషి కాద నుకున్నావా? పిల్లదాని మాడు ఎలా పగిలిందో చూడు నువ్వు కొట్టిన దెబ్బలకి..." అంటూ గొల్లుమని ఏడవసాగింది.

కోడలు సరళ ఇంటిలోపలే ఎక్కడో ఉండి ఎవరికీ కనిపించకుండా తప్పించుకు తిరుగుతోంది.

రాఘవరావుగారు పరిస్థితిని అర్థం చేసుకున్నారు. వెంటనే రాజమ్మ చేతికి ఓ అయి దొందలు ఇచ్చి, "ముందు పిల్లని ఆసుపత్రికి తీసుకెళ్లు..." అంటూ ఆటోను పిలిచి అందులో వాళ్లను ఎక్కించి పంపించాడు.

ఆయన తన గదిలోకి వెళ్లి టీవీ చూడసాగారు. కొంతసేపటికి హడావిడిగా పరుగుపరుగున వచ్చి తన గదిలోకి దూరి తలు పేసుకున్నాడు సుధీర్.

ఆ హడావిడి చూసి సరళ భయంగా తలుపు తడుతూ, "ఏమైందిరా, సుధీ..." అంటూ ఆరా తీసింది.

"కాసేపు నువ్వు నోరు మూసుకోమ్మా...ఎవ్వ రొచ్చినా నేను ఇంట్లో లేనని చెప్పు..." తలుపు తెరవకుండానే సమాధానం చెప్పాడు సుధీర్.

ఆమె గుండె గుభిల్లుమంది. "అసలేం జరిగిందిరా?" మరింత కంగారుగా అడిగిం దామె.

"అబ్బబ్బ...ను వ్వేమీ భయపడకమ్మా. ఇందాక స్కూటర్‌పై వస్తూంటే ఎవరో అమ్మాయికి డాష్ అయింది. ఆ అమ్మాయి కింద పడింది. నే వెనక్కి తిరిగి చూడకుడా వచ్చేశా...ఆ అమ్మాయి కేమన్నా అయిందో, ఏమో తెలియదు. జనం నా వెంట పరుగెడుతుంటే తప్పించుకు వచ్చాను..."

వింటున్న రాఘవరావుగారికి ఎక్కడలేని కోపం వచ్చింది. సాటి మనిషిని గాయపరిచి కనీసం ఏం జరిగిందోకూడా తెలుసుకోకుండా వచ్చిన మనవణ్ణి చాచి లెంపకాయ వేద్దామనుకున్నాడు కాని, అతి కష్టంమీద కోపాన్ని పంటి బిగువనే ఆపుకున్నారు.

మరికాసేపటికి సరళ ఆయన దగ్గరగా వచ్చి, "మావయ్యగారూ! ప్రియ ఇంకా రాలేదండి...రోజూ ఈపాటికి వచ్చేసేది. నాకు భయంగా ఉంది."

"అదేమిటి? అమ్మాయి ఎక్కడి కెళ్లిందో నీకు తెలియదా!"

"కాలేజీ క్లాసు లవగానే కంప్యూటర్ క్లాసు కెళ్తుంది. అట్నుంచి నేరుగా వచ్చేస్తుంది..."

ఆమెమాట పూర్తవకుండానే వీథిలో ఆటో ఆగిన చప్పు డవడంతో అందరూ అటు తలతిప్పి చూశారు. పక్కింటి బామ్మగారితో తలకు కట్టుతో దిగుతున్న ప్రియను చూస్తూనే అవాక్కయింది సరళ. ప్రియను ఇంట్లోకి తీసుకెళ్తూ, "ఏమైం దండీ...?" అనడిగింది బామ్మను.

"ఏం చెప్పమంటా వమ్మా...ఈ కాలం కుర్రాళ్ల పిదపకాలం బుద్ధులు, వెర్రి వెధవలు. బస్సు స్టాండులో బస్సుకోసం నిల్చున్నాం. ఎవడో రౌడీ వెధవ కన్నూమిన్నూ కానక బండి నడుపుతూ ప్రియకు యాక్సిడెంటు చేసి పారిపోయాడు. దొంగవెధవ...పక్కన నే నున్నాను కనక సరి పోయింది. దగ్గరలోనే క్లినిక్‌కు తీసుకెళ్లి కట్టు కట్టించి తీసుకొచ్చాను..."

"దొంగసచ్చినోడు...వాడి చేతులు పడిపోను..." యాక్సిడెంటు చేసిన ఆగంతకుణ్ణి శాపనార్థాలు పెడుతూ కూతుర్ని మంచంపై పడుకోబెట్టింది

## రాజ్‌బబ్బర్ కూతురు నటి అయింది

ప్రముఖ బాలీవుడ్ నటుడు రాజ్‌బబ్బర్, తాను సొంతంగా తీస్తున్న చిత్రంలో కుమార్తె జూహీబబ్బర్‌ను హీరోయిన్‌గా తీసుకున్నాడు. ఆమెకు జోడీగా 'సరిగమ' కార్యక్రమం ద్వారా విశేషకీర్తిని ఆర్జించిన గాయకుడు ప్లస్ నేటి కొత్త హీరో సోనూనిగమ్ చేస్తున్నాడు. చిత్రం పేరు 'కాశ్ ఆప్ హమారే హోతే' (నువ్వు నా దానివయ్యుంటే...). జూహీకి జనం ముందుకు రావటం కొత్తేమీ కాదు. "మా అమ్మగారు నాదిరాబబ్బర్ (రాజ్‌బబ్బర్ మొదటి భార్య) తయారుచేసిన నాటకంలో చేశాను. ఇప్పుడు చిత్రాల్లోకి వచ్చాను. నా తల్లిదండ్రులిద్దరి ప్రతిభలోనూ పది శాతమైనా నాకొస్తే చాలా ఆనందిస్తాను. స్టార్‌ను కాలేకపోవచ్చు కానీ నటిగా ఓ స్థానాన్ని సంపాదించుకోవటమే నా లక్ష్యం. మా నాన్నగారు తమ ఇద్దరితోనూ పోల్చి బాగా మందలిస్తుంటారు" అంటూంది జూహీ.

ఎన్.

సరళ.

అప్పుడే సుధీర్ తన గదిలోంచి బయటకు వచ్చాడు. సుధీర్‌ను చూస్తూనే ప్రియ కెవ్వును కేకేసింది.

"ఏమైందే?" అడిగింది కూతుర్ని సరళ.

"అమ్మా! వీడేనే నాకు యాక్సిడెంట్ చేసింది. చీకట్లో సరిగా కనిపించలేదుకాని, వీ డేసుకున్న గళ్లచొక్కా చూసి గుర్తించాను." చెప్పింది ప్రియ.

"ఓహ్...నువ్వా అక్కడ నిలుచుంది. అయామ్ సారీ."

"ఒరే నువ్వట్రా యాక్సిడెంట్ చేసింది..." సరళ కోపం ఆపుకోలేక కొడుకు చెంపమీద లాగి లెంపకాయ వేసింది.

కాసేపటికి సద్దుమణిగింది ఇంట్లో వాతావరణ.

ఎప్పుడో అపరాత్రికి గేటు తీసుకుని తూలుతూ ప్రవేశించాడు సుధాకరం. భార్యాపిల్లల కోరికలు ఎలా తీర్చాలో తెలియక, ఏ దారీ కనపడక తాత్కాలిక మనశ్శాంతికోసం మత్తుమందును ఆశ్రయించాడు.

అతని వాలకాన్ని చూసిన సరళ పరుగు పరుగున వచ్చి మామగారి కంట పడకుండా భర్తని గదిలోకి లాక్కెళ్లింది కాని, ఇదంతా రాఘవరావు దృష్టిలో పడకపోలేదు.

పక్కగదిలో భార్యాభర్తల వాగ్యుద్ధం సాగుతూనే ఉంది. రాఘవరావుగారి కంటికి కునుకు కరవైంది.

***

ఆ రోజు ఆదివారం అవడంవల్ల అందరూ బారెడు పొద్దెక్కాక గాని లేవలేదు.

అందరూ హాల్లో టీవీముందు కూర్చుని కాఫీలు తాగుతున్నారు.

రాఘవరావు అక్కడికి చేరగానే అందరూ ఆత్రంగా ఆయన ఏం చెబుతారో వినడానికి ఎదురు చూడసాగారు.

ఆయన గొంతు సవరించుకుని, "ఇంకో రెండురోజుల్లో కొత్త సంవత్సరంలో అడుగు పెడుతున్నాంకదా?!"


అందరూ "ఆఁ...అవును" అన్నారు.

ఆయన కొడుకువైపు తిరిగి, "కొత్త సంవత్సరంలో అడుగు పెడుతున్నాం కనుక మనం ఇంట్లోని పాత వస్తువుల నన్నింటినీ మార్చి కొత్త కొత్త వస్తువులతో నింపాలనే కదూ మీ ఆలోచన....?"

"అవును, తాతయ్యా!" ఉత్సాహంగా పలికారు పిల్ల లిద్దరూ.

"టీవీ, ఫ్రిజ్, స్కూటర్, కర్టెన్లు...అన్నీ పాతవైపోయాయి కనుక మార్చాలి అనుకుంటున్నారు. మరి నేనుకూడా పాతవాణ్ణి అయిపోయాను...నన్నుకూడా మార్చేస్తారా?"

ఆయన ఆ మాట అనడంతో అక్క డందరూ అవాక్కయిపోయారు. ఆయన చెప్పాలనుకున్నది గంభీరంగా చెప్పసాగారు. "కొత్త సంవత్సరంలో పండగ చేసుకోవాలంటే కేవలం పాత సామాన్లను మార్చడమే అన్న మీ అభిప్రాయం సరైంది కాదనుకుంటా? మీ పాత ఆలోచనలు మార్చుకోండి. పనిపిల్లకూడా మనలాంటి మనిషే అన్న సంగతి మర్చిపోయి పాశవికంగా శిక్షించడం అవమానం కాదా...? రోడ్డుమీద కన్నూమిన్నూ కానక స్కూటరు డ్రైవ్ చేస్తూ సాటిమనిషికి యాక్సిడెంటు చేసి, కనీసం ఏమైందో



కూడా చూడకుండా అలా రోడ్డుపైనే వదిలేసి రావడం సంస్కారం కాదు. ఆఫీసులో ఎలా లంచాలు రాబట్టాలా అన్న మీ పాత ఆలోచనలకు స్వస్తి చెప్పండి. కొత్త ఆలోచనలకు తావివ్వండి."

ఆ మాటలు విన్న అందరూ తమ మూర్ఖత్వానికి సిగ్గుతో తలలు దించుకున్నారు.

"అవసరాన్ని మించి ఆశించడం అత్యాశే అవుతుంది. ఉన్నదానిలో సంతృప్తి చెందడం అన్నివిధాలా శ్రేయస్కరం. మనం మన పిల్లలకు పంచాల్సింది ఆస్తిపాస్తులు, బ్యాంక్ బ్యాలెన్సులూ కాదు; మంచి నడత, నడవడి. వాళ్లను సమాజంలో మంచి బాధ్యతగల పౌరులుగా చేయాల్సిన బాధ్యత మనపై ఉంది. కనీసం ఈ కొత్త సంవత్సరంలోనైనా కొంగ్రొత్త ఆలోచనలతో కొత్త జీవనపథంవైపు అడుగేయండి." చెప్పడం పూర్తిచేశా రాయన.

అక్కడంతా నిశ్శబ్దం ఆవరించినా, వారి మనసులో మాత్రం అంతర్మథనం ప్రారంభమైంది.

***

ఆ రోజు ఉదయం మార్నింగ్ వాక్‌నుండి తిరిగివచ్చిన రాఘవరావుగారి కంటపడ్డ అద్భుతదృశ్యం తన కుటుంబ సభ్యుల మెదళ్లలో కొంగ్రొత్త ఆలోచనలు వికసిస్తున్నాయని చెప్పకనే చెబుతోంది.

ప్రతిరోజూ పనిపిల్ల లక్ష్మి తన తల్లితోబాటుగా కూర్చుని అంట్లు తోముతూనో లేదా ఇల్లు ఊడుస్తూనో కనిపించేది. కాని, ఆ రోజు అందుకు భిన్నంగా ప్రియగదిలో కూర్చుని చేతిలో పలకా బలపంతో ఓనమాలు దిద్దుతోంది.

రాఘవరావుగారిని చూస్తూనే అందరూ ఆయనచుట్టూ చేరారు.

ప్రియ తాతయ్య పక్కన కూర్చుంటూ, "తాతయ్యా! మీరు చెప్పినట్లుగా కొత్త సంవత్సరమంటే కేవలం కొత్త వస్తువులు సమకూర్చుకోవడం కాదని, కొత్త ఆలోచనలు ఆవిష్కరించడమని తెలుసుకున్నాను. నాకు వచ్చిన కొత్త ఆలోచన అదే...ఈ లక్ష్మికి చదువు చెప్తా అన్నది. నా ఈ ప్రయత్నాన్ని నిర్విఘ్నంగా కానసాగాలని ఆశీర్వదించండి" అంటూ ఆయనకు పాదాభివందనం చేసింది ప్రియ.

"అవును, మామయ్యగారూ, ఇంతకాలం మూర్ఖంగా ప్రవర్తించాను. పనిపిల్ల కూడా మనలాంటి మనిషన్న సంగతే మరిచిపోయాను...."

సరళ మాట పూర్తికాకుండానే, "అవును, నాన్నా, లక్ష్మి చదువుకయ్యే ఖర్చు మనమే భరిద్దాం." మనస్ఫూర్తిగా అన్నాడు సుధాకరం.

"రేపే బడిలో చేరుద్దాం" అంటూ వచ్చాడు సుధీర్.

"చాలురా...చాలు. మీలో ఈ పరివర్తన చాలు. ఈ సంవత్సరం మన ఇంట్లో కొత్త సంవత్సరంగా నిలిచిపోతుంది." ఆనందంగా పలికారు రాఘవరావుగారు.

వారి ఆనందాన్ని ఇనుమడింప చేస్తున్నట్టుగా "కుహు...కుహూ...' రాగాలు పలికింది గండుకోయిల. ఆ ఉగాది వారి ఇంట్లో నవ్య ఉగాదిగా నిలిచిపోయింది. ■

## నాకు అతనంటే పిచ్చి!

ఇలా అన్నది ఎవరయ్యుంటారబ్బా? మరెవరో కాదు, ఒకప్పటి సల్మాన్ ఖాన్ ప్రియురాలే, సోమీఅలీ. ఐశ్వర్యారాయ్‌తో సంబంధాలు తెగిపోయి, పిచ్చివాడిలా తాగి రోడ్ల మీద పడిన రోజుల్లో కూడా అమెరికాలో వున్న సోమీ, సల్లూకు మోరల్ సపోర్ట్‌గా నిలబడిందిట. ఇప్పుడు ఐశ్వర్య పూర్తిగా సల్లూ జీవితం లోంచి తప్పుకుంది కనుక, మళ్లీ తనకు అవకాశం దొరక్కపోతుందా అనే ఆశతో వుంది సోమీ. సల్లూ, తన లేటెస్ట్ ప్రేయసి కాట్రీనాకైఫ్‌తో తీవ్రంగా ప్రణయంలో వున్నాడని తెలిసినా సరే, సోమీ, ఈ జన్మకు పెళ్లంటూ చేసుకుంటే సల్మాన్‌నే చేసుకుంటానని భీష్మించుక్కూర్చుందిట. ఇహ ఇప్పుడు ఈ కథ ఎలాంటి మలుపు తిరుగుతుందో చూడాల్సిందే!

ఎన్.